## బోథ్‌లో 58 వేల క్వింటాళ్ల జొన్నల కొనుగోలు

బోథ్, మే 20 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని మూడు కేంద్రాల్లో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వరకు 58,299 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు సీఈవో గోలి స్వామి తెలిపారు. 2007 మంది రైతులకు చెందిన జొన్నలను మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

## రైతులకు అవగాహన

జైనథ్, మే 20 : భోరజ్ మండలంలోని సిర్సన్న గ్రామంలో ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ వై ప్రవీణ్ కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ డి మోహన్ దాస్ మాట్లాడుతూ పంట మార్పిడి, నీటి సంరక్షణ పద్ధతులు, విత్తన రకాలు, మొక్కలు నాటడం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సిద్ధార్థ, మండల ఉద్యానవన శాఖ అధికారి శ్రీలేఖ్య పాల్గొన్నారు.

తాంసి(భీంపూర్), మే 20: రైతులు పంటలకు వ్యవసాయ శాఖ సూచించిన మేరకే రసాయన ఎరువులు, మందులు వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్త మంజులత సూచించారు. ధనోరలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.

## ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎదులాపురం, మే 20: దవాఖాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే రోగులకున్న వ్యాధులు సహాయకులు, సిబ్బందికి సోకే ప్రమాదం ఉందని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ అన్నారు. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో స్టాఫ్ నర్సులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానాల్లో సంక్రమణ వ్యాధుల నివారణకు కృషి చేసే ఫైండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రిమ్స్‌ను ఇన్ఫెక్షన్ రహిత దవాఖానగా మార్చడానికి ఎంపిక చేసుకుందన్నారు. ఈ నెల 29న ఆ సంస్థ ప్రత్యేక సమావేశం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నందని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

By this deed i, the under singned NERELWAR SRINIVAS S/o NERELWAR GANGARAM, H.No: 3-1-44 Kisangally street, Town & Mandal Bhainsa. Dist: Nirmal, state: Telangana. I changed my name from NERENLWAR SRINIVAS S/o. NERENLWAR GANGARAM to NERELWAR SRINIVAS S/O NERELWAR GANGARAM for all future purpose

**CHANGE OF NAME**

By this deed i, the under singned NERELWAR POSAVVA W/o NERELWAR SRINIVAS, R/o.H.No: 3-1-44, Kisangally street, Town & Mandal Bhainsa. Dist:Nirmal, state: Telangana. I changed my name from NERENLWAR POCHANI to NERELWAR POSAVVA W/o. NERELWAR SRINIVAS for all future purpose

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఆదరణ చూసి ఓర్వలేకనే కేసులు

- జాన్సన్‌నాయక్‌పై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలి
- బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్



కడెం: మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్

కడెం, మే 20 : ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్‌నాయక్‌పై పెరుగుతున్న ఆదరణ కారణంగా కాంగ్రెస్ నాయకులు కావాలనే కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మెలుగూరి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మలేషియాలో చిక్కుకున్న నియోజకవర్గ వాసులను తిరిగి ఇండియాకు రప్పించిన ఘనత జాన్సన్‌నాయక్‌కు దక్కిందన్నారు. ఇలాంటి అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు మింగుడు పడటం లేదని మండిపడ్డారు. జాన్సన్‌నాయక్‌పై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రఫీక్ హైమద్, నాయకులు సతీశ్, కమ్మరి రంజిత్, లచ్చన్న, తిరుపతిరెడ్డి, శివయ్య, స్వామి, కోల గంగన్న, రాజేశ్వర్‌గౌడ్, కోల నరేశ్, మల్లేశ్, రవి, ముత్తన్న, నరేశ్, కోటయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## రాజకీయ దురుద్దేశంతో జాన్సన్ నాయక్‌పై కేసు

ఖానాపూర్, మే 20 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై కాంగ్రెస్ నాయకులు అక్రమంగా కేసులు పెట్టడాన్ని పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు అండగా నిలుస్తున్న జాన్సన్‌నాయక్‌కు ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు కేసులు నమోదు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజగంగన్న, గౌరికర్ రాజు, ప్రదీప్, ఖలీల్, సుమిత్, మోయిద్, గజేందర్, దివాకర్, లాజర్, షఫీ, మెహ్రాజ్, లింగన్న, మహేందర్, వాల్‌సింగ్, గోపాల్ పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెట్టడం అన్యాయం

దస్తురాబాద్, మే 20 : బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై కాంగ్రెస్ నాయకులు ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని మాజీ వైస్ ఎంపీపీ భూక్యా రాజునాయక్ అన్నారు. దస్తురాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎండపెల్లి గంగన్న, దుర్గం శంకర్, భూక్యా కళ్యాణ్, తేలు తిరుపతి, రవి, రాజేందర్, రాజు, మహేశ్, శంకర్, జంగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.



దస్తురాబాద్ : మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్

## ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టండి

పెంబి, మే 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా అక్రమ కేసులు పెట్టడంపై దృష్టి సారించిందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి అన్నారు. పెంబిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నాయకులు చేసిన గొడవ ఘటనను 17 నెలల తర్వాత జాన్సన్ నాయక్‌పై కేసు పెట్టి కక్ష్య సాధింపులకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. అక్రమ కేసులకు బెదిరేదిలేదన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీనే అధికారం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పూర్ణచందర్ గౌడ్, రాజు, నాయకులు సుతారి మహేందర్, విలాస్, గాండ్ల శంకర్, సరోస, సైఫ్‌ఆలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెంబి: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్ రెడ్డి

ఇచ్చోడ, మే 20 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై అకారణంగా కేసు నమోదు చేశారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పిట్ల విజయ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వెళ్తున్న భూక్యా జాన్సన్ నాయక్‌ను ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగించే ప్రయత్నం చేసి హంగామా చేశారన్నారు. ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా కలియ తిరుగుతూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సాధించి, ఆదరణను చూసి ఓర్వలేక కేసు నమోదు చేయించి ఉట్నూర్ పోలీసులు నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో సిరికొండ మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న, మాజీ సర్పంచ్ విజయకుమార్, సునీల్, సిరికొండ మాజీ ఉపసర్పంచ్ చందు, అశోక్,లస్మన్న పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న మారుతి డోంగ్రే

## ముమ్మాటికీ కక్ష సాధింపే

ఉట్నూర్, మే 20: బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై 17 నెలల తర్వాత కేసు నమోదు చేయడమంటే ముమ్మాటికి కక్ష సాధింపు చర్యలేనని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వెళ్తున్న జాన్సన్ నాయక్‌ను కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తూ, ఆపేందుకు ప్రయత్నించారు. అప్పటికే పోలీసులు సర్దిచెప్పి పంపినప్పటికీ మళ్ళీ ఇప్పుడు కేసును నమోదు చేస్తున్నట్లు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ అక్రమ కేసును విరమించుకోకుంటే ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ధరణి రాజేశ్, సింగారే భరత్, కాటం రమేశ్, జయచంద్ర, అనుదీప్, బాబా, మహేందర్, సత్యం, సురేశ్, సాయి, కేశవ్, వసంత్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, మే 20 : కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మారుతి డోంగ్రే అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాన్సన్ నాయక్‌కు పెరుగుతున్న ప్రజాధారణ ఓర్వలేకనే 17 నెలల క్రితం జరిగిన ఘటనపై ఇప్పుడు కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు అమ్జద్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జిలానిబేగ్, నాయకులు భీంరావ్, లఖన్, ధన్‌రాజ్, సుఫియాన్, శివాజీ, శైలెందర్ పాల్గొన్నారు.



ఉట్నూర్: మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్



ఖానాపూర్: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు





ఇచ్చోడ: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పిట్ల విజయ్

# విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఎదులాపురం, మే 20 : జిల్లాలోని అన్ని షాపుల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటైలర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీవోఎస్ పరికరాలు, స్టాక్ లిక్విడేషన్ వినియోగంపై వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల పంపిణీ విషయంలో పారదర్శకత ఉండాలి, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాలకు విక్రయాలు, నిషేధిత మిశ్రమ ఎరువుతు, బీటీ-3 విత్తనాలు అమ్మడం అనుమతించబడదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా నేషనల్ ఫర్టిలైజర్స్ కంపెనీ ద్వారా డీలర్లకు ఈ పీవోఎస్ యంత్రాలు పంపిణీ చేశారు. డీలర్లు రోజువారీగా ఈపీవోఎస్ ద్వారా అమ్మకాలు నమోదు చేయాలని, దుకాణాల వద్ద స్థాక్ వివరాలు, టాస్క్‌ఫోర్స్ సభ్యుల వివరాలు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జీ శ్రీధర్ స్వామి, ఏడీఏ ఇచ్చోడ రామకృష్ణ, సాంకేతిక వ్యవసాయ అధికారి విశ్వామిత్ర, నేషనల్ ఫెర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు వంశీ కృష్ణ, మారుతి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

# సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 20 : జిల్లాలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టర్ సమావేశమందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, రాజేశ్‌కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## తరుగు పేరిట దోపిడీ



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

నిర్మల్ చైన్‌గేట్, మే 20 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కన్నా తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రాజూరకు చెందిన రైతులు మామడ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ పేరిట బస్తాకు నాలుగు కిలోల చొప్పున అధికంగా కాంటా పెడుతున్నారని రైతులు పేర్కొన్నారు. అధికారులకు కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై రైతులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలుపడంతో రైతులు ఆందోళన విరమమించారు.

# గంజాయి రవాణాపై గుండంపల్లి గ్రామస్తుల తిరుగుబాటు

దిలావర్‌పూర్ మే 20: గుట్టు చప్పుడు కాకుండా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో కొద్ది రోజులుగా గంజాయి విక్రయిస్తున్నారు. 20 రోజుల క్రితం ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో నిర్మల్ జిల్లా పోలీసులు తనిఖీ చేపట్టారు. మంగళవారం అదే గ్రామంలో ఉంటున్న ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే సమాచారంతో గ్రామస్తులందరూ ఏకమై అనుమానితుడిని పట్టుకొని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిలకు సమాచారం అందించారు. జిల్లా పోలీసులతో కలిసి అక్కడికి వచ్చిన ఎస్పీకి గ్రామస్తులు అనుమానితుడిని అప్పజెప్పారు. అనంతరం గ్రామస్తుల ఎదుట అతని వివరాలు సేకరించి, అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గుండంపల్లి గ్రామస్తుల ఐక్యతను అభినందించారు. కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

# చట్టాలు దుర్వినియోగం చేస్తున్న నాయకులపై చర్యలు

ఇంద్రవెల్లి, మే 19: ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేస్తున్న జాతి ద్రోహులైన ఆదివాసీ సంఘాల నాయకులపై చర్యలు తీసుకుంటామని రాయిసెంటర్ జిల్లా సార్ మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దర్బార్ భవనంలో గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో 1/70 చట్టం ఆసరాగా చేసుకొని దుర్వినియోగం చేస్తున్న నాయకులపై చర్యలు, ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ బాదీ రావ్, రాయిసెంటర్ సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావు, జిల్లా నాయకుడు పుర్క బాపు రావు, వెట్టి రాజేశ్వర్, ఆయా గ్రామాల ఆదివాసీ నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## జాన్సన్ నాయక్‌పై కక్ష సాధింపు చర్యలు



భైంసా, మే 20 : బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ అన్నారు. మంగళవారం భైంసా ఆయన మాట్లాడుతూ 2003 లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు జాన్సన్ నాయక్‌ను అడ్డగించే ప్రయత్నం చేసి హంగామా సృష్టించారు. అప్పటి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు కేసు నమోదు చేశారని అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## పసిపాప పాల కోసం ఆవు లేగ విరాళం

ఎదులాపురం, మే 20 : ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని తిప్ప కొలంగూడ గ్రామంలో తల్లిని కోల్పోయిన నెల రోజుల పసిపాపకు పాల కోసం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి ఆవు లేగను విరాళంగా అందజేశారు. ఏప్రిల్ 18వ తేదీన ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆత్రం రాణిబాయి ఈ నెల 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఈశ్వరీబాయి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆవు లేగను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆమె మాట ప్రకారం ఆవును పాప తండ్రి ఆత్రం కృష్ణ, తాత నాయనమ్మలు ఆత్రం కటోడ బూరిబాయిలకు విరాళంగా అందజేశారు. ఈశ్వరీబాయి మానవతా దృక్పథానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## రెవెన్యూ భూముల్లో సాగును అడ్డుకుంటున్నారని నిరసన

పెంబి, మే 20: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని ఎంగ్లాపూర్ గ్రామంలోని రెవెన్యూ, అసైండ్, పోడు భూముల్లో సాగును అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మంగళవారం రైతులు నిరసన తెలిపారు. అనంతరం పెంబిలో తహసీల్ కార్యాలయంలో డీటీ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార నాయకులు మాట్లాడుతూ సాగును అడ్డుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## పశువుల పాకలు దగ్ధం

బోథ్, మే 20: ఆదిలాబాద్ జిల్లా సొనాలలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు కాలి బుడిదయ్యాయి. రేంజర్ల సుదర్శన్, రేంజర్ల రాముకు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అందులో నిల్వ ఉంచిన పశుగ్రాసం వ్యవసాయ పరికరాల సామగ్రి, స్పింకర్ల పైపులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.5.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. రెవెన్యూ శాఖాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## గంజాయి నిందితుల అరెస్ట్

భైంసా, మే 20 : ఏప్రిల్ నెల 29వ తేదీన గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితులను అరెస్టు చేయగా మిగతా ఇద్దరు తప్పించుకొని తిరుగుతున్న అలియాస్ అట్టు, తురాబ్ ఖాన్‌ను బైల్ బజార్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. వారి వద్ద నుంచి 1.250 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నిర్మల్ అర్బన్, మే 20: నిర్మల్‌లోని సోఫినగర్ కాలనీలో గల ఓ స్క్రాప్ దుకాణంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. యజమాని షేక్ ఫజిల్ తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిన అనంతరం ఉదయం దుకాణానికి వచ్చే సరికి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి ఫైర్ అధికారులు చేరుకుని మంటలు ఆర్పి వేశారు. రూ. 7 లక్షల ఆస్తినష్టం సంభవించిందని తెలిపారు.

## చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

నిర్మల్ అర్బన్, మే 20: ఆదిలాబాద్ జిల్లా గుర్జమున్నూరు కాపు గ్రామానికి చెందిన ఆశిష్(32) నిర్మల్‌లో బంధువుల వద్ద ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు.ఆశిష్‌కు గతంలో వివాహమై విడిపోయాడు. దీంతో మద్యానికి బానిసై మనస్థాపానికి గురై బంగల్‌పేట్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## యువతుల ఫొటోలు తీస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, మే 20 : యువతుల, మహిళల అనుమతి లేకుండా దొంగచాటుగా ఫొటోలు తీస్తున్న వ్యక్తిని షీటీం ద్వారా అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన కే వేణు (34) యువతుల, మహిళల ఫొటోలు తీస్తున్నాడు. ఇదే క్రమంలో బస్టాండ్ సమీపంలో ఓ యువతి ఫొటోలు తీస్తున్న సమయంలో ఆ యువతి షీటీంను సంప్రదించింది. దీంతో షీ టీం సభ్యులు కోవట్ ఆపరేషన్ చేసి కే వేణును పట్టుకున్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

## అనుమతి లేని ధర్నాలకు టెంట్ ఇస్తే కేసు

ఎదులాపురం, మే 20: కలెక్టరేట్ ఎదుట, ఇతర ప్రదేశాల్లో అనుమతి లేని ధర్నాలకు టెంట్‌లు ఇస్తే సంబంధిత యాజమాన్యాలపై కేసు నమోదు చేస్తామని టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని సీఐ కోరారు.

## అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎదులాపురం, మే 20: అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ సీహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఫిల్టర్ బెడ్‌లోని మండల ఆఫీస్‌కు సంబంధించిన క్వార్టర్స్ వెనకల గుర్తు తెలియని వ్యక్తి వేప చెట్టు కింద పడిపోయి ఉన్నాడు. మృతి చెందిన వ్యక్తి ఎరుపు రంగు షర్ట్, బూడిద రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. వ్యక్తికి ఫిట్స్ రావడం, వడదెబ్బ, మరి ఇతర అనారోగ్య కారణ వల్ల చనిపోయినట్లు కనిపిస్తోంది. వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిసినచో టూటౌన్ సీఐ 8712659920 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ముథోల్ తహసీల్దార్‌గా శ్రీలత

ముథోల్, మే, 20 : నిర్మల్ జిల్లా ముథోల్ తహసీల్దార్‌గా శ్రీలత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీకాంత్ నర్సాపూర్ (జీ)కి బదిలీ పై వెళ్లారు. ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో పని చేసిన తహసీల్దార్ శ్రీలత బదిలీపై ముథోల్‌కు వచ్చారు. ముథోల్ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

## దస్తురాబాద్ తహసీల్దార్‌గా విశ్వంబర్

దస్తురాబాద్, మే 20 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌గా బత్తుల విశ్వంబర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సర్ఫరాజ్ నవాజ్ బదిలీపై లోకేశ్వరం మండలానికి వెళ్లారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కుంటాల, మే, 20 : కుంటాల మండలం కల్లూరులోని బీడీ ఫ్యాక్టరీ ఎదుట టీయూసీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, జిల్లా కార్యదర్శి రామ లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస పింఛన్ రూ.9 వేలు అమలు చేయాలని, రైతు రుణాలు మాఫీ చేసి కనీస పంటల మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## గౌడ సంఘ కార్యవర్గం

లక్ష్మణచాంద, మే 20: నిర్మల్ జిల్లా లక్ష్మణచాద మండల గౌడ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గరిపెల్లి గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా మేడి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా మేడి సంతోష్ గౌడ్, సలహాదారుడిగా రమణగౌడ్, పడారి రాజేశ్వర్ గౌడ్, గౌరవాధ్యక్షుడిగా మేడి నారాగౌడ్, గున్నాల అంజగౌడ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని మండల గౌడ సంఘం సభ్యులు అభినందించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి ఎద్దు మృతి

జైనథ్, మే 20: సాత్నాల మండల పరిధిలోని మేడిగూడ(సీ) గ్రామంలో రైతు ఎల్గత్ గంభీర్‌కు చెందిన ఎద్దు మేతకు వెళ్లి సోమవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రైతు గంభీర్ ఫిర్యాదు మేరకు జైనథ్ మండల పశు వైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే, సాత్నాల విద్యుత్ లైన్‌మెన్లు ఎద్దుకు పోస్టుమార్టం నిర్వహించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు తప్పదు

ఇంద్రవెల్లి, మే 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు తప్పదని అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు సుభద్రబాయి, పెంటుబాయి అన్నారు. మంగళవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఇంద్రవెల్లిలోని తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను పునరుద్ధరిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి

భైంసా, మే, 20 : నిర్మల్ జిల్లా భైంసా- బాసర మార్గంలో బోకర్ చౌరస్తా సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాలేగాంకు చెందిన పవార్ అచ్యుతానంద్ పాటిల్ (46) మంగళవారం సాయంత్రం సదరు పెట్రోల్ బంకు నుంచి రోడ్డుపైకి వస్తుండగా, బాసర వైపు నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్యుతానంద్ పాటిల్ కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు ఎమ్మెల్యే రామరావు పటేల్‌కు సమీప బంధువు కావడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పరిచయస్తులు భారీగా దవాఖానకు చేరుకున్నారు.

### ట్రాక్టర్ బోల్తా పడి ..

తలమడుగు, మే 20 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లి(కే) గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామానికి చెందిన సిడాం సురేశ్(22) భరంపూర్ గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా కొంతకాలంగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై లింగారెడ్డి కుమారుడు ప్రణీత్‌తో కలిసి పనులకు వెళ్లాడు. పల్లి(కే)కు వెళ్లే రోడ్డు పక్కన గుంతలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పడడంతో డ్రైవర్ సిడాం సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన వెంట ప్రణీత్‌కు తీవ్ర గాయలయ్యాయి. ప్రణీత్‌ను రిమ్స్‌కు తరలించారు. కాగా సంఘటన స్థలానికి ఎస్ఐ రాధిక చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### షార్ట్ సర్క్యూట్‌తో రజకుడు..

భైంసాటౌన్, మే 20 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ముత్యం(45) మంగళవారం దస్తులకు ఇస్త్రీ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యం తన ఇంటికి అనుకొని ఉన్న రేకుల షెడ్డులో లాండ్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం దస్తులకు ఇస్త్రీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబీకులు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

### అప్పుల బాధతో వృద్ధుడు ఆత్మహత్య

ఎదులాపురం, మే 20: అప్పుల బాధ భరించలేక మహారాష్ట్రకు చెందిన వృద్ధుడు ఆత్మహత్యకుయత్నించి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ సిహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. మహారాష్ట్ర కిన్వట్ తాలూకా టెంబి గ్రామానికి చెందిన జాదవ్ శేషురావు (60) సోమవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే సమీప దవాఖానకు తీసుకెళ్లి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ చేసినట్లు తెలిపారు.